శ్రుతి మించిన అపశ్రుతి

యర్రంశెట్టి వరలక్ష్మి

'నేను కాలేజీలో చేరుతున్నాను...'

రాజారావు వంక చూస్తూ ఉత్సాహంగా అంది ఇందిర.

రాజారావు ఉలిక్కి పడ్డాడు. దెబ్బ తిన్నట్లు ఆమె వంక చూశాడు.

ఇందిర అదేమీ గమనించలేదు.

'నాన్నగారు ఒప్పుకొన్నారు...సాయంత్రం విన్నోసారి రమ్మన్నారు కూడా. నాకంతా కొత్తకదా! నువ్వే నన్ను తీసుకెళ్ళి చేర్పించాలి...'

రాజారావుకి కలవరం పుట్టుకొస్తోంది. విరాగ్గా కిటికీలోనుంచి బయటకు చూడ సాగాడు.

'రోజూ మనిద్దరం చక్కగా కలిసి కాలేజీకి పోవచ్చుకదూ...'

'సరేలే!...కాసేపు నన్ను రికార్డు వ్రాసుకోనీ! తర్వాత మాట్లాడుకొందాం.'

విసుగ్గా అనేసి ఏదో పుస్తకం తీసి వ్రాయడానికి సంసిద్ధుడయ్యాడు రాజారావు.

అతని విసుగుచూసి ఇందిర కొద్దిగా నిరుత్సాహ పడింది.

'సరే ... వ్రాసుకో ... సాయంత్రం మాట్లాడదాంలే మనం...గ్రూప్ ఏం తీసుకోవాలో కూడా నువ్వే చెప్పాలి మరి!...'

రాజారావు ఏమీ మాట్లాడలేదు. తల వంచుకొని ఆమెమాట లేమీ విననట్లే నటించాడు.

ఇందిర మెల్లగా బయటకు వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయిం తర్వాత రాజారావు రెండు చేతుల్తోనూ తలపట్టుకొని కూర్చుండి పోయాడు!

'ఇందిర కాలేజీలో చేరుతుంది. కాలేజీలో ముందస్తుగా తనే ఆమెనుంచి తప్పించుకు తిరగాలి. కాలేజీ ఆవరణలో గాని, రోడ్డుమీదగాని తనతో మాట్లాడొద్దని ఖచ్చితంగా చెప్పెయ్యాలి. లేకపోతే తనని కూడా అందరూ ఆటలు పట్టిం చేస్తారు. అసలు మొదట్నుంచే ఆమెకు దూరంగా వుంటే బావుండేది. ఇందిర

వాళ్ళో తను ప్రశాంతంగా ఉన్నా ఇంట్లో అడ్డెక్కు దిగి నాలుగయిదేళ్ళు అవుతుందేమో! ఇందిరతో ఆ చుట్టుప్రక్కల పిల్లలెవ్వరూ స్నేహం చేసే వాళ్ళుకాదు. ఒకరిద్దరు ఆడపిల్లలు తప్పితే మరెవ్వరూ ఆమెని దగ్గరకు చేరనీరు. మొహమాటం కొద్దీ తను ఇందిరతో మాట్లాడక తప్పటం లేదు. అంచేతే ఇందిరకి తనంటే అభిమానం. ఏ విషయమయినా ముందుగా తనతోనే చెబుతుంది. ఇంతకీ భగవంతుడు ఇందిర నెందుకు ఇంత కురూపిగా సృష్టించాడో. ఆమె మొఖంవంక చూస్తూ ఓ నిమిషం కూడా మాట్లాడ బుద్ధికాదు.

ఆ సాయంత్రం రాజారావు కోసం అతని ఇంట్లో ప్రవేశించింది ఇందిర.

'వాడలా బజారు వేపు వెళ్ళాడమ్మా!' అంది రాజారావు తల్లి.

ఇందిర నీరు కారిపోయింది.

'సాయంత్రం రాజారావుని పిలుచుకొస్తానన్నా ..మీరు మాట్లాడండి!' అని చెప్పింది తను తండ్రితో. తన కాలేజీ చదువు గురించి కొన్ని వివరాలు తెలుసుకోవాలను కొన్నారాయన. కాలేజీలో చేరడానికి తనెంతో గొడవ చేస్తేనేగాని ఒప్పుకోలేదాయన. మెల్లగా వెనక్కు తిరిగి తన ఇంట్లోకి నడిచిందామె.

'రాజారావ్ ఏదో పనిమీద బజారు కెళ్ళాట్టనాన్నా...వచ్చాక పిలుచుకొస్తాను అంది తండ్రితో...

ఆయన సంగతి గ్రహించుకొని లోలోపలే బాధ పడ్డాడు.

'అవును! ఇంత వికృతంగా ఉన్న ఆడపిల్లతో మాట్లాడ్డానికి ఎవరికి మనసొప్పుతుంది? నువ్వూ ఓ యువకుడివే రాజారావ్... నీది తప్పులేదు. ఒకోసారి అర్థంలేని పనులు చేసే భగవంతుణ్ణను కోవాలి ..అంతే!' అనుకొన్నారాయన.

'పోనీలేమ్మా ... వచ్చాకె మాట్లాడదాంలే!'

రాత్రి రాజారావు భోజనం చేస్తూంటే ఇందిర వచ్చి గడపలో నుంచుంది.

'ఏయ్...సాయంత్రం ఉంటానని వెళ్ళిపోయావ్ కదూ?'

'మర్చి పోయానిందిరా...ఆ సంగతి గుర్తేలేదు నాకు...' అన్నాడు రాజారావ్.

'అవును ... నే చెప్పేవేవీ నీకు గుర్తుండవ్...' అంది కోపంగా.

'ఛఛ! అదేంకాదు...కాసేపుండు వస్తున్నాను...'

రాజారావు ఇందిర ఇంటికెళ్ళేసరికి అప్పుడే థర్మామీటరు చూస్తున్నారాయన.

'ఇంకా జ్వరం తగ్గలేదాండీ!' అడిగాడు రాజారావు.

'ఫరవాలేదు...ఇవాళ నార్మల్‌కి వచ్చేసింది...' అన్నారాయన.

కాసేపాగి 'నువ్వో చిన్న సహాయం చెయ్యాలి బాబూ...ఇందిర కాలేజీలో చేరతానని గొడవ చేస్తోంది. నేను లేవలేని స్థితిలో వున్నాను. కాస్త నువ్వే అమ్మాయిని తీసుకుపోయి చేర్పించాలి...'

'అలాగేనండీ.. రేపే చేర్పిద్దాము...' అన్నాడు రాజారావు.

'అమ్మాయ్...కొంచెం మంచినీళ్ళు తేమ్మా..' అడిగారాయన.

ఇందిర లోపలికి వెళ్ళింది.

'బాబూ! రాజా...ఇందుని అభిమానించే స్నేహితులెవరూ లేరు. అందుక్కారణం నీకు తెలుసు నేను నిన్ను కోరేది వక్కటే. దానినెప్పుడూ అసహ్యంచుకోకు. కనీసం దానికలా అనిపించనీయవద్దు...దానికి నీమీద అంత అభిమానం వుంది...' తరువాత మాట్లాడలేకపోయా డాయన.

ఇందిర మంచినీళ్ళు తీసుకువచ్చింది.

మరి కొంచెంసేపవీ ఇవీ మాట్లాడిం తరువాత రాజారావు ఇంటి కొచ్చేడు అతని వెనుకే ఇందిర కూడా వచ్చింది

'రేపెన్నింటికి వెళ్ళాలి మనం?' అంది ఉత్సాహంగా.

'తొమ్మిదింటికల్లా బయల్దేరాలి...' ముక్తసరిగా జవాబిచ్చాడు రాజారావు.

'సరే నేను రడీగా వుంటాను... ఓ వేళ నన్ను మళ్ళీ మర్చిపోయి వెళ్ళిపోవు గదా?..'

'ఛవ్! మరీ అంత మతిమరుపను కొన్నావేమిటి?..'

చిన్నగా నవ్వి వెళ్ళిపోయింది ఇందిర.

ఆ రాత్రి చాలాసేపటివరకూ రాజారావుకి నిద్రపట్టలేదు.

'ఇందిరని తనవెంబడి తీసుకవెళ్తే, అందరూ తమిద్దరినే చిత్రంగా చూస్తారు. తన క్లాస్‌మేట్సు గొడవ చేసినా చేసేస్తారు. ఆ 'రంభ' ఎక్కడ దొరికిందిరా అని ఎగతాళి చేస్తారు... అంచేత ఇందిర నొక్కర్తినే ముందువెళ్ళి ప్రిన్సిపాల్ గదిదగ్గర నుంచోమన్జెప్పాలి. అక్కడ తను కలుసుకొని ఇంటర్వ్యూ అయింతరువాత మళ్ళీ ఆమెను తప్పించుకుపోవచ్చు.

ప్రొద్దున్న ఎనిమిదిన్నరకల్లా ఇందిర తయారయిపోయి రాజారావు దగ్గర కొచ్చింది.

'చూశావా? నువ్వు తొమ్మిదంటే, నేను ఎనిమిదిన్నరకే రడీ అయిపోయాను!' అంది నవ్వుతూ.

రాజారావు ఆమెవంక పరీక్షగా చూశాడు.

'నీలంరంగు పరికిణీ, దానిమీద తెల్లని పువ్వుల ఓణి వేసుకొంది. నీలంజాకెట్టు ఇవన్నీ ఆమె యవ్వనాన్ని చాటుతోన్నాయి కాని, అందాన్నివ్వలేకపోతున్నయి. మరింక చూడబుద్ధికాక తల దించుకొన్నాడతను.

'ఇందిరా ఓ చిన్నపని చేస్తావూ?'

'ఏమిటదీ?' విస్మయంగా చూసిందామె.

'నీకు కాలేజీ తెలుసు కదా? వెళ్ళిపోయి ప్రిన్సిపాల్ గదిదగ్గర నుంచో! నేను ఓ అరగంటలో సైకిల్‌మీద వచ్చేస్తాను. ఏం?'

ఇందిర మారాం చేసింది

'ఊ ఎందుకేం?. నాకసలే కొత్త... నాతో రాకూడదేమిటి నువ్వు '

'ఊహూ' అదికాదు. మా స్నేహితుడింట్లో చిన్న పనుంది.. వెళ్ళి అలా వచ్చేస్తాను ప్లీజ్ '

ఇందిర అతని మొఖంలోకి ఓ క్షణం చూసి 'సరే నేను అక్కడే నీకోసం.. ఎదురు చూస్తుంటాను మర్చిపోకేం?' అంటూ వెళ్ళిపోయింది

రాజారావు హాయిగా గాలి పీల్చుకొన్నాడు. మరి కాసేపటిలో ఇందిర వెళ్తున్నానే అమ్మా!' అనడం వినిపించిందతనికి.

అతను కాలేజికి చేరుకొనేసరికి ఇందిర అప్పటికే అరగంటనుంచీ అతనికోసం ఎదురు చూస్తోంది ఆమె ప్రక్కనే నలుగురు ఆడపిల్లలు నుంచొని నవ్వుతూ ఏదో మాట్లాడుకొంటున్నారు. చిక్కు

శృతిమించిన అపశృతి

వెక్కి వెక్కి ఏడుస్తూ అందరివంకా చూస్తున్న ఇందిరకి రాజారావుని చూడటంతోనే ప్రాణం లేచి వచ్చినట్లయింది.

'రాజా...' అంటూ బిగ్గరగా పిలిచింది.

ఆడపిల్లలు మాట్లాడ్డం తక్కున ఆపేసి రాజారావు వంక తిరిగి చూశారు. రాజారావు చాలా సిగ్గుపడిపోయాడు. ఇందిర వంక కోపంగా చూసి వూరుకొన్నాడు. మరికాసేపటికి ఫీజు కట్టేసిం తర్వాత ఇద్దరూ కాలేజీ బయటకొచ్చారు

'ఈవారమంతా నువ్వు కాలేజీకి రానక్కర్లేదు ... క్లాసులు జరగవు!' అన్నాడు రాజారావు.

'సరే!...నా కేవేం పుస్తకాలు కావాలో నువ్వే కొనుక్కురా...'

'అవన్నీ నేను చూసుకొంటాలే. నువ్వింటికి వెళ్ళిపో.. నేను క్లాసుకి వెళ్తాను...' అనేసి వడివడిగా వెళ్ళిపోయాడు.

నెలరోజులు గడిచినయి. ఈ నెల రోజుల్లోనూ ఇందిర మానసికంగా చాలా కృంగిపోయింది. క్లాసులోని ఆడపిల్లలందరూ ఆమెను వెలివేసినట్లు చూడ్డం మొదలెట్టారు. 'శూర్పణఖ' అని కొంత మంది కుర్రాళ్ళు ఆమెకు పెట్టినపేరు కాలేజి అంతా ప్రాకిపోయింది. క్లాసులో ఇందిర కూర్చునే బెంచి మీద మిగతా ఆడపిల్లలు కూర్చునే వారుకాదు. ప్రతి రోజూ పాఠం జరుగుతూండగా ఆమె మీదకు కాగితపు వుండలు, బాణాలు వచ్చి పడుతుండేవి.

కొంతమంది లెక్చరర్లు కూడా ఆమెను ఏదోరకంగా అవమానానికి గురిచేస్తూండే వారు.రాను రాను ఆమెలోని ఓర్పు నన్నగిల్లిపోయింది. ఒకోరోజు కాలేజీకి కూడా వెళ్ళకుండా ఇంట్లో కూచుని ఏడుస్తూండేది. తల్లీ తండ్రీ తప్పితే ఇందిర మనసు విప్పి మాట్లాడేది ఒక్క రాజారావుతోనే. రాజారావంటే ఆమె అంత అభిమానంగా వుండటానికి కారణం తన మాటలను అతను అసహ్యించుకోకుండా హేళన చెయ్యకుండా వినడమే. అంతకంటే ఇందిర రాజారావు నుంచి ఎక్కువేమీ ఆశించలేదు. మనసులోని బాధంతా అతనితో చెప్పాలని అనేకసార్లు అనుకొంది. కాని చెప్పేస్తే, అతను గూడా అందరిలా చూస్తాడేమోనని భయం వేత ఊరుకుండి పోయింది.

ఆరోజు ఇందిర కాలేజికి వెళ్ళేసరికి అప్పుడే సెకండ్ బెల్ అవుతోంది. గర్ల్స్ వైటింగ్ రూమ్‌లోకి వెళ్తూ లోపలి మాటలు విని అక్కడే ఆగిపోయింది.

'ఏయ్ సరూ! శూర్పణఖ ఇంకా రాలేదేం?' అంది పద్మ.

'ఛ! ఇప్పుడే దాన్ని తల్చుకోడవెందుకే... క్లాసులో ఎలాగో దాని పాడుమొఖం చూస్తూ కూర్చోక తప్పదుగా...' సరోజ జవాబు.

ఫొల్లున నవ్వులు.

'ఛ...ఛ...దాని అవతారానికితోడు 'మేనర్స్'కూడ తెలీదే...అన్నీ వెకిలి చేష్టలు...' అంది లక్ష్మి...

ఇందిరకి ఏడుపొచ్చేసింది. తమాయించుకొని లోపలికి నడిచింది.

ఆమెను చూడగానే అందరూ మరేవో విషయాల గురించి మాట్లాడుకోసాగారు. ఆమె సరాసరి పద్మదగ్గరకెళ్ళి ఆగింది.

'పద్మా!...ఎందుకు...నేనంటే మీకంత కోపం?. నేను అందంగా లేకపోతే అది నా తప్పా? .నేను కావాలని వికృతంగా పుట్టానా ?. .దీనికి నేనేం చేయను .. ఎందుకు మీరందరూ నన్నువెలేసినట్లు చూస్తారు ... నన్నెందుకిలా హింపిస్తారు?...' అనేసి చేతుల్లో మొఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడవ సాగింది. ఆమెచేతిలోని పుస్తకాలు క్రిందపడి పోయినయి. అంతా నిశ్శబ్దమయిపోయింది.

ఆమె దుఃఖంనుంచి తేరుకొనేప్పటికి థర్డ్ బెల్ అయిపోయింది. రూములో ఎవ్వరూ లేరు. క్రిందపడిన పుస్తకాలన్నీ ఏరి పట్టుకొని బయటకు నడిచింది. అప్పుడు క్లాసులోకెళ్తే జరిగేదేమిటో ఇందిరకు బాగాతెలుసు. ఇంగ్లీష్ లెక్చరరు గారు తనని చూడనట్లే నటించి తలుపు దగ్గర పదినిమషాలు నుంచుండబెడతాడు. అందరికళ్ళూ తనవంకే చూస్తుంటాయి. లోపలికి నడుస్తుంటే ఎవరో ఏదో అంటారు. అందరూ గొల్లున నవ్వుతరు. తనొక్కర్తే ఓ ఖాళీ బెంచిమీద కూర్చోవాలి... ఎటు చూచినా తనొక్కర్తే. తనకి ఎవ్వరూ లేరు...

'అప్పుడే వచ్చేశావేం?' అడిగింది ఇందిర తల్లి.—

'క్లాసులో నవ్వు!' అప్రయత్నంగా అబద్ధం చెప్పేసింది ఇందిర. పుస్తకాలు టేబుల్ మీద విసిరేసి తన మంచంమీద వంగి పోయింది.

ఆవేళ సాయంత్రం రాజారావు కాలేజి నుంచి ఇంటికొచ్చేసరికి బాగా పొద్దు పోయింది.

తన గదిలోకి నడిచి లోపల కూర్చుని ఉన్న ఇందిరని చూసి ఆశ్చర్యపోయాడతను.

'ఏమిటిక్కడ కూర్చున్నావ్?' అన్నాడు చిత్రంగా చూస్తూ.

'నీకోసం...చూస్తున్నాను...' అంది తల వంచుకొని.

'మళ్ళీ...ఏమిటి?..' అన్నాడు కోపంగా ఆమెవంక చూస్తూ.

ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి. మొఖం వాడి వుంది. జుట్టు చెరిగింది.

క్షణం అతనివంకే చూసి దగ్గరగా వచ్చేసింది ఇందిర.

రాజారావ్ తెల్లబోయాడు.

'ఇందిరా ఎందుకేడుస్తున్నావ్.ఏమయింది?' అన్నాడు భయంగా.

ఇందిర జవాబివ్వలేదు. లేచి నుంచొని గోడకు మొఖం రాచుకొని ఏడవసాగింది.

రాజారావు ఆమె దగ్గరగా నడిచాడు.

'ఇందిరా! చెప్పు ఏం జరిగింది?'

ఆమె జవాబివ్వలేదు.

ఆమె రెండుభుజాలు పట్టుకొని తన వేపు తిప్పుకొన్నాడతను.

'ఇందూ ... అలా ఏడవకు?. ప్లీజ్ చెప్పవూ.ఏమయింది?...ఎవరయినా గొడవ చేశారా?'

ఇందిర తలెత్తి అతనివంక చూసింది. దుఃఖం మరింతగా వచ్చింది.

'రాజా!. ' అంటూ అతనిహృదయం మీదికి వరిగిపోయింది.

'నేనింక కాలేజికి వెళ్ళను రాజా.. అక్కడ ఎవ్వరూ నాతోమాట్లాడరు. ఆఖరికి మా క్లాసు అమ్మాయిలుకూడా... అందరికీ నేనంటే అసహ్యం.. నేను కూర్చునే బెంచిమీద ఎవ్వరూ కూర్చోరు .. నామీద కాగితాలు విసురుతారు...అందరూ నన్ను 'శూర్పణఖ' అని పిలుస్తారు. రాజు...నేను...ఏజబ్బయినా వచ్చి చచ్చిపోతే బాగుండుననిపిస్తోంది.

రాజారావు కళ్ళ ...

శృతిమించిన అపశృతి

నయి. ఇందిరమీద విపరీతమయిన జాలి కలిగిందతనికి.

'అందరూ అసహ్యించుకొంటే ఇందిర గతేం కావాలి, అందరితో కలసి వుండా లనీ, అందరిలా సరదాగా జీవితం గడ పాలనీ ఆ అమ్మాయికీ కోరికలుండవూ? . కురూపిగా పుట్టటం ఇందిర తప్పా... మరి శిక్ష ఈమెకెందుకు?. '

ఇందిరని గాఢంగా హృదయానికి హత్తుకొన్నాడతను.

'ఇందిరా. .ఏడవకమ్మా!.. ఎవరేన్నన్నా నువ్వేం పట్టించుకోవద్దు. ఎవ్వరూ మాట్లాడకపోతే నీకేం?. నేను లేనూ?... మనిద్దరం చక్కగా మాట్లాడుకొందాం .. అసలు నువ్వెవరితోనూ మాట్లాడొద్దు ఎవ్వరేమన్నా అసలు వినొద్దు. ... కొన్ని ఇంటికొచ్చాక.. ... ... పోతే క్లాసులో ... ... నేను చెప్తాను. ఏం? తెల్సిందా?...'

ఇందిర కళ్ళు ఆనందంతో మెరసినయి. అతని నుంచి దూరంగా జరిగి ఓణీతో కన్నీళ్ళు తుడుచుకొంటూ నిలబడింది. కొంచెం సేపాగి 'నేను ... వెళ్తాను. ' అంటూ వెళ్ళిపోయింది. ఈ సంఘటన తరువాత ఆమె హృదయం తేలిక పడింది. చాలా రోజుల తరువాత హాయిగా నిద్రపోయింది ఇందిర ఆ రోజు.

తర్వాత ఇందిర క్లాసులోని కుర్రాళ్ళ వెక్కిరింపులు పట్టించుకోడం మానే సింది. ఆ రోజునుంచీ ఆమె రాజారావు మీద విపరీతమయిన అభిమానం పెంచు కొంది. ఆమె దృష్టిలో రాజారావు దేముడు. ప్రతిరోజు సాయంత్రం కాసే పయినా అతనితో మాట్లాడకపోతే పిచ్చెక్కినట్లు వుంటుంది.

ఆ రోజు నుంచీ రాజారావు ఇందిరని అదివరలా అసహ్యించుకోడం మానేశాడు. పాపం! తనూ నిర్లక్ష్యం చేస్తే ఇందిరకి జీవితం మీదే విరక్తి పుడుతుంది.. తనని తనే అసహ్యించుకోడం మొదలెడుతుంది.. ఆ తరువాత ఏం జరిగినా ఆశ్చర్యపడ నవసరంలేదు.

వారం రోజులు గడచినయి. ఆ రోజు ... రాజారావు కాలేజీ ఆవరణలో కొచ్చేసరికి

అతని క్లాస్‌మేటు రమణ కనబడ్డాడు.

ఇద్దరూ కలసి నడవడం సాగించేరు.

ఉన్నట్టుండి రమణ గట్టిగా అరచేడు.

'గురో! శూర్పణఖ వస్తోంది...'

రాజారావు గుండెలు ఝల్లు మన్నయి. తలెత్తి చూచాడు. ఎదురుగా ఇందిర వస్తోంది. అప్పుడే వీళ్ళిద్దరినీ ఆశ్చర్యంగా చూస్తోంది. రాజారావు రమణని మందలించాలనుకొన్నాడు కానీ ఏదో బలహీనత అతన్ని మాట్లాడనీయలేదు.

'మన జూనియర్స్ పెట్టారుగురో... దీనికా పేరు.. చాలా సూటబుల్ నేమ్ సెలక్ట్ చేశారు కదూ?...'

రాజారావు తల వంచేసు కొన్నాడు. ఇందిర ఆ మాటలన్నీ వినుంటుంది. తనే రమణతో అలా అనిపిస్తున్నాడనుకొంటుందేమో! ఇంటికి వెళ్ళిపోయి ఏడుస్తూ కూచుంటుంది... ఇప్పుడు ఇందిరకి చెప్ప కోడానికూడా ఎవ్వరూ లేరు.. దీనికంతా కారణం రమణ. .

అతని మొఖం ఎర్రగా అయింది. 'ఒరేయ్...' తీవ్రంగా అరచాడతను రమణ ఆగిపోయి ఆశ్చర్యంగా రాజారావు వంక చూశాడు.

'మరోసారి . ఇందిర నేమయినా అన్నా వంటే నీ అంతు చూస్తాను ' అన్నాడు పిడికిళ్ళు బిగించి

అతని కోపానికి రమణ భయపడినా, అతని మాటలు చాలా చిన్నతనం అని పించిందతనికి.

'ఆ పిల్లనంటే నీకెందుకురా అంత కోపం? ఇందిర నీకేమయినా బంధువా?'

'అదంతా నీ కనవసరం!' అన్నాడు రాజారావు కోపంగా.

రమణకి ఉక్రోషం ఆగలేదు.

'నా యిష్టం! నేనంటాను! ఏం చేస్తావ్?' అన్నాడు మొండిగా. అతని మాట పూర్తవకుండానే రాజారావు అతని మొఖం మీద బలంగా గుద్దాడు. రమణ చేతిలోని పుస్తకాలు క్రింద పడేసి రాజా రావుతో కలబడ్డాడు

వాళ్ళముందు నడుస్తున్న నలుగురు కుర్రాళ్ళు వచ్చి వారిద్దరినీ విడదీశారు.

'అరె! ఏమయిందిరా! ఇంతవరకూ బాగానే వున్నారుగా?'

రమణ ముక్కు వెంబడి రక్తం కారు

తోంది. ఆయాసంతో రొప్పుతూ అన్నాను.

'రాస్కెల్.. వీడు ... ఆ శూర్పణఖని... లవ్ ..చేశాడురా..అం...దు...కే దాన్నంటే.. వీ . డి . కి కోపం...'

ఆమాటతో రాజారావు కోపమంతా మాయమయిపోయింది. ఓరకమయిన భయం అతనిలో ప్రవేశించింది. నెమ్మదిగా రమణదగ్గరకు నడిచి అతని రెండు చేతులూ పట్టుకొన్నాడు.

'రమణా! క్షమించరా! ... జరిగింది మర్చిపోదాం!.. కాని అలాంటిమాటనకు! ఇందిర వాచెల్లాయ్‌లాంటిదిరా...

ప్రతిమాలుతోన్న కంఠంతో అంటూంటే అతని కళ్ళు చెమ్మగిలినయి. రమణ విసురుగా చేతులు వెనక్కులాక్కొని ముందుకునడిచాడు.

ఆసాయంత్రం ఇందిర రాజారావుకోసం రాలేదు. రాజారావు మనస్సంతా అల్లకల్లోలమయిపోయింది. ఇందిర మనసు ఖచ్చితంగా గాయపడివుంటుంది. ప్రొద్దున్న ఇందిరని కలుసుకొని' క్షమాపణ చెప్పకోవాలి...

మర్నాడు ప్రొద్దున్న తొమ్మిదవుతోందగా ఇందిర ఇంటికివెళ్ళి బయటనుంచి 'ఇందిరా' అంటూ పిల్చాడతను.

'కాలేజికి వెళ్ళిపోయింది...' అంది ఇందిర తల్లి. ఓవేళ ఇందిర తనమంచి తప్పించుకు తిరుగుతుందేమో, అని అనుమానం వచ్చిందతనికి. త్వరత్వరగా కాలేజి వైపు నడిచాడతను. కాలేజి గోడలమీద తాటికాయంత అక్షరాలతో శూర్పణఖ—రాజారావుల పేర్లు అసభ్యకరమయిన విశేషాలతో వ్రాసివున్నాయి. అది చూసేసరికి రాజారావు కళ్ళు చీకట్లు క్రమ్మినయి. క్లాసుకి వెళ్ళబుద్ధికాలేదు. వెనక్కు తిరిగి ఇంటికొచ్చేశాడు. అవమానంతో తల కొట్టేసినట్టయిపోయింది.

'ఇదంతా ఇందిర మూలానే జరిగింది... ఆ రాక్షసిమూలానే తనకింత అవమానం! ఇక కాలేజీలో తన మొహం ఎలా చూపించగలుగుతాడు?...ఇకనుంచి ప్రతివాడూ తననిచూసి హేళన చేస్తాడు. ఇంత అందవిహీనురాలితో తనకి సంబంధం...ఛీ... తను ఈ కాలేజినుంచి వెళ్ళిపోవాలి... లేపోతే ఇందిరయినా వెళ్ళాలి. ఛ. ఛ.. లేనిపోని జాలిపడి...తనపరువుపోగొట్టుకొన్నాడు...తనపాలిట దయ్యంలా దాపురించింది...

'రాజా!' ఇందిర గొంతు విని ఉలిక్కిపడ్డాడు రాజారావు.

ఆమెని చూడగానే అతనికి విపరీతమయిన కోపం వచ్చింది.

'ఏయ్... ఇక్కడికెందుకొచ్చావ్ ... ఫో ఇక్కడి నుంచి.. నన్ను శనిలాగా పట్టుకొన్నావ్...నీ మూలాన నేను అల్లరిపాలయ్యాను.. అంత వికృతంగా పుట్టిన దానివి మాటలంటే పడలేవూ?.. ఫో! మళ్ళీ నా దగ్గరకి రాబోకు ... నేనూ అంటాను.. నువ్వు శూర్పణఖవి.. శూర్పణఖ...' పిచ్చిగా అరచాడు రాజారావు.

ఇందిర నిశ్చేష్టురాలయి నిలబడిపోయింది. అప్రయత్నంగా ఆమె కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి.

'రాజా .. నాది తప్పే ... తప్పంతా నాది...' బిగ్గరగా ఏడ్చేస్తూ అందామె. ఏడుస్తూనే పరిగెత్తుకొంటూ వెళ్ళిపోయింది.

ఆ రోజంతా రాజారావు గదిలోంచి బయటకు రాలేదు.

మర్నాడు ప్రొద్దున్న రాజారావు నిద్రలేచే సరికి ఎనిమిదయిపోయింది. లేవడంతోనే అతనికి ఇందిర గుర్తొచ్చింది.

'పాపం! తను చాలా మాటలన్నాడు. పిచ్చిపిల్ల! ఏం చేస్తుందో? ... రాత్రి అన్నం తిందో లేదో?.. ఇందిరకి తన బాధ చెప్పుకోడనికి ఎవరయినా ఉన్నారూ అంటే అది తను ఒక్కడే! తనే అలా...'

'ఒరేయ్ రాజా!' తల్లి వచ్చింది.

'పాపం ఇందిర తెల్లారుఝామున కిరసనాయిలు పోసుకొని తగలబెట్టుకొని చచ్చిపోయిందిట ఓసారి వెళ్ళిరారాదూ?'

రాజారావు గుండెలు ఓక్షణం ఆగిపోయి తిరిగి కొట్టుకోడం మొదలెట్టినయి. దూరంగా సన్నగా ఏడుపులు వినబడుతున్నాయి అవును లేదనుకొని ప్రయత్నించి విఫలుడయ్యాడు. అతని శరీరంలోని ఏ భాగమూ అతని స్వాధీనంలో లేదు.